క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయంలో ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా గుమ్మం ఏర్పాటు చేసిన దృశ్యం

ఆకివీడు: స్థానిక ఆనాల చెరువు గట్టు వద్ద వేంచేసియున్న వల్లీ దేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా గురువారం ఆలయానికి గుమ్మం ఏర్పాటు చేశారు. గుమ్మం మూహూర్తానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధి నేరెళ్ల రామకృష్ణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు రామకృష్ణ ఆధ్వర్యంలో గుమ్మం పూజతో గుమ్మంను అమర్చారు. ఈ కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గురోతు విజయ్‌కుమార్, మోటుపల్లి గంగాధరరావు, యర్రా తాతారావు, నేరెళ్ల చిన ఆదినారాయణ, మోరా జ్యోతి శ్రీనివాసరెడ్డి, మన్నే పోతరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ



బీవీ రాజు వర్ధంతి సందర్భంగా బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: స్థానిక శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ బీవీ రాజు 21వ వర్ధంతి సందర్భంగా గురువారం భీమవరం పట్టణం, పరిసర గ్రామాల్లో పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా కళాశాల ఆవరణలోని బీవీ రాజు విగ్రహానికి విద్యార్థులు, అధ్యాపకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శృంగవృక్షంలోని లెప్రసీ సెంటర్, ఎఫ్ఎంఎల్ఆర్ సెంటర్స్‌ల్లోని లెప్రసీ రోగులకు బియ్యం, పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే భీమవరం సెయింట్ మేరీస్ లెప్రసీ సెంటర్‌లో లెప్రసీ, ఎయిడ్స్, టీబీ రోగులకు రూ. 50 వేలు విలువ చేసే మందులు, బియ్యం, పండ్లు పంపిణీ చేశారు. 7వ వార్డు లెప్రసీ కాలనీలో 112 మంది రోగులకు బియ్యం, పింఛన్లు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే కుముదవల్లి, బీవీరాజు మార్గ్, బీవీ రాజు మునిసిపల్ పార్క్ తదితర ప్రాంతాల్లో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లోఓల్టేజ్ సమస్య పరిష్కారానికి చర్యలు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి

ఆకివీడు: పట్టణంలో విద్యుత్ లోఓల్టేజ్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి చెప్పారు. స్థానిక బైపాస్ రోడ్డులోని సాయిబాబా గుడి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యుత్ సమస్య పరిష్కారానికి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహారాజు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. పట్టణంలో మరో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టినట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగ్గురోతు విజయ్‌కుమార్, గుండా సుందరరామనాయుడు, మోటుపల్లి గంగాధరరావు, మోరా జ్యోతి, కుంచాడ బాబ్జీ, కుంచాడ యశోద, శ్రీహరి, గుండా సుందరరామనాయుడు, మోరా శ్రీనివాసరెడ్డి, అందే రాజబాబు, తిమ్మారెడ్డి మాధవి, జగన్, గుండుగొలను సావిత్రి, తిప్పా దుర్గా భవానీ, గునుకుల కొండ, ఎండీ. ఆలీ, కేశిరెడ్డి దుర్గారావు, ఏఈ ప్రసాదరాజు పాల్గొన్నారు.

కుళాయి చెరువులో చేపలు పట్టే వేలం వాయిదా

నరసాపురం: మున్సిపాలిటీ కుళాయి చెరువులో చేపలు పట్టుకునేందుకు హక్కులు కల్పించేందుకు గానూ గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన బహిరంగ వేలంపాట రద్దయ్యింది. మళ్లీ ఈ నెల 12న సోమవారం పాట నిర్వహిస్తామని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. ప్రారంభ పాటను రూ 5 లక్షలుగా నిర్ణయించి పాట మొదలు పెట్టారు. అయితే చెరువలో ఐదు అడుగులు మించి లోతుకు చేపలు పట్టకూడదని నిబంధన విధంచారు. పాటదారులు చేపలు ఎలా పట్టుకోవాలనే అంశంపై పలు అనుమానాలు వ్యక్తం చేయడంతో పాటను వాయిదా వేస్తూ కమిషనర్ నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉంటే 20 సంవత్సరాలు తరువాత కుళాయిచెరువులో చేపలు పడుతున్నారు. ఈ హక్కును మత్స్యకారులకే కేటాయించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు సీహెచ్ చినరెడ్డప్ప ధవేజీ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

వైభవంగా మావుళ్లమ్మ జ్యేష్టమాస జాతర

జాతరను ప్రారంభించిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



మావుళ్లమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



అమ్మవారి జాతరలో అసాదుల నృత్యాలు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం విలవెల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారి జ్యేష్ట మాస జాతర మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జాతర మహోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి జాతరలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సీరుల్లి కూరగాయపండ్లు వర్తక సంఘం ప్రతి ఏడాది మాదిరిగానే జ్యేష్టమాస జాతరను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అమ్మవారి అశీస్సులు ప్రజలందరికి ఉండాలన్నారు.

కన్నుల పండువగా జాతర

అసాదుల నృత్యాలు, డప్పుల వాయిద్యాలు, శక్తి వేషాల, విన్యాసాలు, బుట్టబొమ్మలు, మ్యూజికల్ బ్యాండ్ ,బాణసంచా కాల్పులు మధ్య హంస వాహనంపై అమ్మవారి ఊరేగింపుతో జాతరను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల నరసింహరాజు, ఏఎంసీ చైర్మన్ కొటిపల్లి బాబు, ఏఎస్.రాజు,కోడే యుగంధర్, నీరుల్లి కూరగాయ పండ్లవర్తక సంఘం, ఉత్సవ కమిటి సభ్యులు కొప్పుల సత్తిబాబు, రామాయణం గోవిందరావు, రామాయణం సత్యనారాయణ, తుటారపు ఏడుకొండలు, ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రజి, ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లిఖార్జునశర్మ, ధర్మకర్తల మండలి చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ధర్మకర్తలు మావూరి సుందరరావు, ముత్యాల రామారావు, చెల్లంకి గిరి, తాళ్ళపూడి భాగ్యలక్ష్మి, కొయ్య వెంకటలక్ష్మీ, గోపిశెట్టి విజయలక్ష్మీ, నీలాపు విజయనాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగులకు గాయాలు

నరసాపురం: పట్టణంలోని నరసాపురం–మొగల్తూరు మార్గం 216 జాతీయ రహదారిపై సత్తిబాబు జ్యూస్ సెంటర్ వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సచివాలయ ఉద్యోగులు గాయపడ్డారు. లక్ష్మణేశ్వరం గ్రామ సచివాయంలో పని చేస్తున్న కోపెర్ల విజయదుర్గ , పాత్తూరి వెన్నెల ఇద్దరు స్కూటీపై పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయానికి పని ముగించుకుని వెళ్తుండగా, నరసాపురం వైపు బైక్‌పై వేగంగా వచ్చిన యువకుడు ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వెన్నెల పరిస్థితి విషమంగా ఉండటంతో భీమవరం తరలించారు. విజయదుర్గ స్థానికంగా ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు టౌన్ ఎస్సై ప్రసాద్ చెప్పారు.

ఇసుక తవ్వకాలపై తనిఖీలు

మొగల్తూరు: అనుమతులు లేకుండా తవ్వుతున్న ఇసుక తవ్వకాలపై గురువారం మైనింగ శాఖాధికారులు తనిఖీలు చేశారు. మండలంలోని వారతిప్ప గ్రామంలో పర్యటించిన అధికారులు మట్టి తవ్వుతున్న ప్రాంతాలపై దాడులు నిర్వహించారు. జిల్లా మైనింగ్ జియాలిజీ శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ కేవీ రమణ, టెక్నికల్ అసిస్టెంట్ అశోక్‌లు తవ్వకాలు పరిశీలించి వివరాలను నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామన్నారు. వీరి వెంట వీఆర్‌ఓ సుజాత ఉన్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



సీసలిలో మట్టి తవ్వకాలు చేస్తున్న దృశ్యం



ఏలూరుపాడులో మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు

- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ అధికారులు

కాళ్ల: మండలంలోని అనేక గ్రామాల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయి. దీంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బంది పడడమే కాకుండా ప్రభుత్వాదాయానికి కూడా గండి పడుతుంది. గతేడాది మైనింగ్ అధికారులు మట్టి మాఫియాపై ఉక్కుపాదం మోపడంతో అప్పట్లో మట్టి రవాణాకు అడ్డుకట్టపడింది. మైనింగ్ నిబంధనల ప్రకారం నిర్దిష్ట రుసుము చెల్లించి మట్టి రవాణా చేయాలనే నిబంధనలతో అక్రమ మట్టి వ్యాపార దందా నిలిచిపోయింది. ఈ ఏడాది వేసవి రాకముందు నుంచే మట్టి మాఫియా విచ్చలవిడిగా మట్టి రవాణా సాగుంది. దీనిపై మైనింగ్‌శాఖ పర్యవేక్షణ లేకపోవడంతో నిబంధనలకు విరుద్ధంగా మట్టి రవాణా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో రాత్రి, పగలు తేడా లేకుండా వందలాది భారీ వాహనాలు, ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని ఏలూరుపాడు, కోమటిగుంట, సీసలి, దొడ్డనపూడి, కాళ్లకూరు, జువ్వలపాలెం, కలవపూడి గ్రామాల నుంచి కృష్ణాజిల్లా నుంచి పెద్ద ఎత్తున మట్టి అక్రమ రవాణా సాగుతుంది. నివాసిత ప్రాంతాల మీదుగా మట్టి రవాణా వాహనాలు రాకపోకలు సాగించడంతో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. మట్టి రవాణా వాహనాలతో అధ్వానంగా మారిపోతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి మాఫియాకు క్లెం వేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మట్టి తరలింపునకు అనుమతులు తప్పనిసరి

వ్యవసాయేతర భూములు పూడ్చాలన్నా, మట్టిని ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తరలించాలన్నా కచ్చితంగా అనుమతులు ఉండాల్సిందే. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే అట్టివారిపై చర్యలు తీసుకుంటాం. దీనిపై ఇప్పటికే అన్ని గ్రామాల వీఆర్వోలకు ఆదేశాలిచ్చాం.

– టీఏ కృష్ణారావు, తహసీల్దార్

ఎన్నికల హామీలను అమలు చేస్తున్న ఘనత జగన్‌దే



భీమవరంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న వైద్యసిబ్బంది

సాక్షి, భీమవరం: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వైద్య శాఖ ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో గురువారం భీమవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్‌ను వైద్య ఉద్యోగులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాఖ ఉద్యోగులు, సిబ్బంది ఎన్నో ఏళ్లుగా ట్రెజరీ ద్వారా జీతాలివ్వాలంటూ ఉద్యమాలు చేశారని ఇప్పటి వరకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారానే జీతాలు చెల్లిస్తు వచ్చారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షనాయకుడిగా పాదయాత్ర చేసిన సందర్భంలో వైద్య ఉద్యోగులు తమ సమస్యలను జగన్ దృష్టికి తీసుకువెళ్లడంతో సమస్యను పరిష్కరిస్తానని ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను దుశ్శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో జిల్లా డీసీఎస్ ఇన్‌చార్జ్ అధికారి ఎ.వీరాస్వామి, వైద్యులు మాధవికల్యాణ్, శ్రీనివాస్, పద్మ, ప్రవీణ్ కుమార్, ప్రశాంతి, సత్యవతి తదితరులున్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

పెనుగొండ: రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. గురువారం పెనుగొండలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండా సూరిబాబు, నాగిశెట్టి గంగారావు, ఎర్రంశెట్టి సుబ్బరాజు, దూలం ప్రసాద్, కంబాల ఆదినారాయణ పాల్గొన్నారు.

మండుటెండలో ట్రాఫిక్ ఇక్కట్లు



జాతీయ రహదారిపై మండుటెండలో నిలిచిన ట్రాఫిక్

ఆకివీడు: ట్రాఫిక్ సమస్యతో జాతీయరహదారిపై నిత్యం వాహనాలు నిలిచిపోవడంతో వాహన చోదకులకు, ప్రయాణీకులకు, స్థానికులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుంది. ఉదయం నుంచి సాయింత్రం వరకూ జాతీయ రహదారి రద్దీగా ఉండటంతో వాహనాలు నిరంతరం నిలిచిపోతున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు, స్థానికులు జాతీయరహదారిపై వెళ్లాలంటేనే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పలు చోట్ల దుఖాణాదారులు రోడ్డు మార్జిన్లలోకి వచ్చి వ్యాపారాలు చేయడంతో మరింత ట్రాఫిక్‌కు ఆటంకం ఏర్పడుతుంది. మాదివాడ సెంటర్ నుంచి అయిభీమవరం టర్నింగ్ వరకూ నిరంతరం ట్రాఫిక్‌తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ఉండేవారు. ప్రస్తుతం పోలీసులు ట్రాఫిక్ సమస్యను మరచిపోయినట్లున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారితో పాటు, అయిభీమవరం టర్నింగ్ వద్ద, సిద్ధాపురం రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, కూరగాయల మార్కెట్ రోడ్డుల్లో చిరువ్యాపారులు రోడ్లపైకి వచ్చి తోపుడు బండ్లతో వ్యాపారం చేయడంతో ట్రాఫిక్ నిలిచిపోతుందని స్థానికులు వాపోతున్నారు. ట్రాఫిక్ సమస్యకు పోలీసులు, రెవిన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అధిక వేగంతో ట్రాక్టర్లు



ఆకివీడు మండలం స్థానిక అయిభీమవరం టర్నింగ్ వద్ద నిలిచిపోయిన ట్రాక్టర్

ఆకివీడు: ట్రాక్టర్ల వేగానికి హద్దు, అదుపు లేకుండా పోతుంది. జాతీయ రహదారిపై అతి వేగంగా ట్రాక్టర్లను నడపడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానిక అయిభీమవరం టర్నింగ్ వద్ద గురువారం ఉదయం మోటారు సైకిలిస్టును ట్రాక్టర్ ఢీకొట్టడంతో మోటారు సైకిల్‌పై వెనుక కూర్చున్న బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. జాతీయ రహదారిపై అతివేగంగా వెళ్లతున్న ట్రాక్టర్ల వల్ల అక్కడక్కడా జరుగుతున్న ప్రమాదాలు పోలీస్ స్టేషన్ వరకూ వెళ్లడం లేదు. ట్రాఫిక్ కానిస్టేబుళ్లు లేకపోవడంతో మట్టి ట్రాక్టర్లు, ధాన్యం లోడు, ఇతర లోడుతో వెళ్లతున్న ట్రాక్టర్లు అతివేగంగా నడుపుతున్నారని స్థానికులు వాపోతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలోని తాడేరు విద్యుత్ ఉపకేంద్రం నుంచి పెదగరువు ఉపకేంద్ర వరకు వెళ్లే 33 కేవీ లైన్లపై చెట్లు, కొమ్మలు తొలగించడం, వార్షిక మరమ్మతుల నిమ్మితం పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం విలేకరులకు తెలిపారు. తాడేరు, యనమనపల్లి, కొ్రపాడు, బేతపూడి, కరుకువాడ, పెదగరువు, చినగరువు, రాజుల గరువు, వెంప, శ్రీరామపురం, తుందుర్రు, జొన్నలగరువు గ్రామాలతో పాటు వీరవాసరం మండలంలోని దూసనపూడి, మత్స్యపురిపాలెం, కమతాలపల్లి, బాలేపల్లి గ్రామాలకు తుందుర్రులోని గోదావరి మెగా ఆక్వా ఫుడ్ పార్కు పరిశ్రమకు ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 11.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దాతల సహకారం అభినందనీయం



రైఫిల్ షూటింగ్‌లో జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ప్రభుత్వ శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని భీమవరం ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ అన్నారు. స్థానిక వైఎస్సార్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బాలలకు సత్కారం , బాలలకు స్ఫూర్తి అనే కార్యక్రమంలో భాగంగా రైఫిల్ షూటింగ్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన ముగ్గురు బాలలను సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి, డీవీ నాగేశ్వరరావు, కె.పద్మ, ఎం.శ్యామల, డి.శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సు కోసమే సైకిల్ యాత్ర

మొగల్తూరు: జల, జంతు, వన సంరక్షణ నినాదంతో నెలల తరబడి సైకిల్ యాత్ర చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్‌కు చెందిన చాత్రాతి విజయ్‌గోపాల కృష్ణ సైకిల్ యాత్ర చేస్తూ తణుకు, పెనుగొండ, పాలకొల్లు, నరసాపురం మీదుగా గురువారం మొగల్తూరుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 2022 మార్చి 11న స్వగ్రామం నుంచి బయలు దేరి ఇప్పటి వరకు 11 రాష్ట్రాల్లో పర్యటించానని, ఉదయం పర్యటన మొదలు పెడుతూ మధ్యాహ్నం కాసేపు విశ్రాంతి తీసుకుంటానని, రాత్రి పూట దేవాలయం లేదా అనువైన ప్రదేశంలో విశ్రాంతి తీసుకుంటానన్నారు. ఇప్పటి వరకు ఘనాపూర్, తుల్జాపూర్, షిర్డీ, నాసిక్, త్రయంబకేశ్వరం, నర్మదా నది, నాందేడ్, త్రివేణి సంగమం, కాశీ, అయోధ్య, ఆగ్రా, లక్నో, మధుర, హర్యాయానా, పంబాజ్, సిందూ నది ప్రాంతాల్లో పర్యటించానన్నారు. తన యాత్ర కన్యాకుమారి వరకూ సాగుతుందని, ఇప్పటి వరకూ సుమారు 430 రోజులు సైకిల్ యాత్ర చేశానని, మరో 70 రోజుల్లో తన యాత్ర పూర్తివుతుందన్నారు. తమ పూర్వీకులు ఇదే జిల్లాలోని తణుకు మండలంలోని కొమరవరం గ్రామమని, 1971లో రాయచూర్‌కు వెళ్లి స్థిరపడ్డామని వివరించారు.

పాసపోర్టు పోయినది

[illegible] తేది 27.05.2023 [illegible] పాస్‌పోర్టు నెం.L9290546 [illegible]

భూములు కౌలు హక్కునకు టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

పశ్చిమగోదావరిజిల్లా, కాళ్ళ మండలం, కాళ్ళ గ్రామంలో వేంచేసియున్న శ్రీ సోమేశ్వర స్వామి వారి దేవస్థానం హక్కు భుక్తములో గల దిగువ సుదహరించిన భూములకు ది.20-06-2023 తేది మంగళవారం ఉదయం గం. 9.00లకు దేవస్థానం వద్ద దేవదాయ శాఖ అధికారుల సమక్షమున సదరు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారిచే టెండరు కమ్ బహిరంగ వేలం పాట నిర్వహించబడును. [illegible] పాటలో పాల్గొనవలసినదిగా కోరడమైనది.

వ.నెం	భూమి ఉన్న గ్రామం	రి.స.నెం.	విస్తీర్ణం య.సెం	ధరావత్తు రూ	కౌలు కాలము
1	కాళ్ళ	28	14-12	15000/-	1 సంవత్సరము

పాట షరతులు దేవస్థానం కార్యాలయం పనిచేయువేళలలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారిని అడిగి తెలుసుకొనవలెను.

గ్రామం: కాళ్ళ
తేది: 08-06-2023

శ్రీ గనిశెట్టి షణ్ముఖేశ్వరరావు, చైర్మన్ మరియు ధర్మకర్తలు
కె.శ్రీనివాసరాజు, కార్యనిర్వహణాధికారి

ప్రమాదాలకు నిలయంగా పేరుపాలెం బీచ్



బీచ్‌లో సందడి చేస్తున్న సందర్శకులు(ఫైల్)

- అవగాహన లేమితో పెరుగుతున్న ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోతున్న యువత

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం బీచ్ ప్రమాదాలకు నిలయంగా మారింది. సముద్ర స్నానం చేస్తూ గల్లంతవుతున్న వారు కొందరైతే, ప్రమాదాల బారిన పడి కాలు,చెయ్యి విరగకొట్టుకుంటున్న వారు మరికొందరు. చాలామంది యువత సముద్ర స్నానానికి అనువుగా లేకపోయినా ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న అలలను చూసి ఉత్సాహంతో వాటికి ఎదురెళ్లి మృత్యువాత పడుతున్నారు. గత 2015 నుంచి ఇప్పటివరకూ సుమారు 35 మంది పేరుపాలెం బీచ్ వద్ద మృత్యువాత పడ్డారు. 2015లో ఆరుగురు, 2016లో ఇద్దరు, 2017లో ముగ్గురు, 2018లో ఎనిమిది మంది, 2019లో ఐదుగురు, 2021లో నలుగురు, 2022లో నలుగురు, 2023లో ఇప్పటి వరకు ముగ్గురు గల్లంతై మృతి చెందారు. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ నుండి పాలకొల్లు శుభకార్యానికి వచ్చిన ఇద్దరు యువకులు సముద్ర స్నానానికి దిగి మృత్యువాత పడి ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపారు.

19 కిలో మీటర్ల సముద్ర తీర ప్రాంతం

నియోజకవర్గంలో సుమారు 19 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. అయితే నరసాపురం మండలంలో లేని విధంగా మొగల్తూరు మండంలోని పేరుపాలెం, కేపీ పాలెం తీరప్రాంతంలో కొబ్బరి, సరుగుడు తోటలతో పాటు ఆలయాలు వెలిశాయి. దీంతో సందర్శకులు రాక మొదలుకావడంతో క్రమేణా బీచ్‌లుగా మారాయి. మూడు దశాబ్దాలు క్రితం కేపీ పాలెం తీరంలో మొట్టమొదటగా వేళాంకణి మాత ఆలయాన్ని నిర్మించడం, అనంతరం సముద్రంలో కొట్టుకు వచ్చిన వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో జిల్లాలోనే తీర ప్రాంతాలు గుర్తింపునకు నోచుకున్నాయి. అంతేకాక ప్రతీ ఏటా మేలో నాలుగు రోజులపాటు వేళాంకణి మాత ఉత్సవాలు, కార్తీకమాసంలో వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహస్తారు. దీంతో తీరంలో సౌకర్యాలు లేకపోయినా, సముద్ర స్నానానికి అనువుగా లేకపోయినా సందర్శకులు తరలివచ్చి సేద తీరుతుంటారు. కార్తీక మాసంలో నెలరోజులపాటు వేలాది మంది పర్యాటకులు సముద్ర స్నానం చేసి ఆలయాలను దర్శించుకుని తీరంలోని కొబ్బరి, సరుగుడు చెట్ల మధ్య వన భోజనాలు చేస్తుంటారు. అయితే ప్రతీ ఏటా వేలాది మంది భక్తులు వస్తున్నా సౌకర్యాలు మాత్రం అంతంతమాత్రంగానే ఉంటాయి.

సముద్ర స్నానానికి అనువైన ప్రాంతం కాదు

సముద్రంలోకి దిగిన వారికి కాలు అడుగు భాగంలో గొయ్యి కింద ఏర్పడుతుంది. మద్యం సేవించి స్నానాలకు దిగడం లేదా అవగాహన లేకపోవడంతో అలలు వచ్చిన సమయంలో బ్యాలెన్స్ చేసుకోలేక పడిపోయి గల్లంతవుతున్నారు. ఆ ప్రాంతంలో కార్తీకమాసం మినహా మామూలు రోజుల్లో బందోబస్తు ఉండదు. కార్తీక మాసంలో అయితే రెవెన్యూ, పోలీస్ అధికారులు గజ ఈతగాళ్లను, పోలీస్ సిబ్బందిని నియమించి సముద్రంలోకి వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటారు. మామూలు రోజుల్లో ఎవరి అడ్డూ అదుపు లేకపోవడంతో రెట్టించిన ఉత్సాహంతో ముందుకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారు.

పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం



పేరుపాలెం బీచ్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను డీఐజీ ముదునూరి ప్రసాదరాజు, జిల్లా ఎస్పీ రవిప్రకాష్‌లు ప్రారంభించారు. త్వరలో పూర్తి స్థాయిలో సిబ్బంది ఇక్కడ బాధ్యతలు చేపడతారు. సముద్ర స్నానానికి వెళ్లే వారికి అవగాహన కల్పించి తగు రక్షణ చర్యలు తీసుకుంటాం.

– ఎం.వీరబాబు, ఎస్సై, మొగల్తూరు